క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

కాటారం: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మహాముత్తారం మండల శాఖ అధ్యక్షుడు జాటోత్ రాంసింగ్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 17 రోజులుగా సమ్మె చేస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిలిచిపోయాయన్నారు. పదవ తరగతి పరీక్షలు దగ్గరలో ఉన్నందున సమ్మె కారణంగా విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులకు స్పష్టమైన హామీ ఇచ్చి సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండగట్టు బయల్దేరిన హనుమాన్ మాలధారులు

వాజేడు: హనుమాన్ దీక్షలను చేపట్టిన భక్తులు ఇరుముడుల తీసుకుని మాల విరమణ కోసం శుక్రవారం బయలుదేరి వెళ్లారు. మండల పరిధిలోని పూసూరు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఒప్పుసూరు, ఎడ్జర్లపల్లి గ్రామాలకు చెందిన మాలలు ధరించిన స్వాములు నియమ నిష్టలతో 41 రోజుల పాటు దీక్షలను చేశారు. గురుస్వామి సూమిత్రి వేణుగోపాల చార్యులు ఇరుముడులకు అనుమతిని ఇవ్వడంతో మాల విరమణ కోసం వారంత కొండగట్టుకు తరలివెళ్లారు.

'మెపా' మండల అధ్యక్షుడిగా రమేశ్



వెంకటాపురం(ఎం): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) మండల అధ్యక్షుడిగా మండలంలోని కేశవపూర్ గ్రామానికి చెందిన మేకల రమేశ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు. తన నియమాకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు అచ్చూనూరి కిషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, నాయకులు తాళ్ల రవీందర్, రామకృష్ణ, చిరంజీవి, సాదు రఘుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



ఏటూరునాగారం: తెలంగాణ దివ్యాంగుల సమితి మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బానోతు శ్రీధర్‌నాయక్ నాయక్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పెద్ద బోయిన శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మున్నాభాయ్ ఆదేశానుసారం శుక్రవారం మండల కేంద్రంలో దివ్యాంగుల మండల కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు.

మిర్చి పంటల పరిశీలన



కాళేశ్వరం: ప్రగతి అగ్రిసైన్స్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు రైతులతో కలిసి శుక్రవారం మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 25 రోజుల నుంచి మిరప పంటలను సందర్శించడం జరుగుతుందన్నారు. నల్లి అనేది కొంతమంది తోటలలో ఇప్పుడిప్పుడే కనిపిస్తుందని తెలిపారు. నల్లిని గమనించి మార్గో పవర్ మందు వాడి, తోటలను నల్లి నుంచి కాపాడుకుని అధిక దిగులు సాధించాలని రైతులకు సూచించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

విధులకు దూరంగా ఉద్యోగులు



రేగొండలోని కేజీబీవీ



తాళం వేసి ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం

- సమ్మెలో సమగ్ర శిక్ష సిబ్బంది
- కేజీబీవీల్లో నిలిచిన బోధన
- విద్యాశాఖలో కదలని ఫైళ్లు

రేగొండ: కేజీబీవీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో విద్యార్థుల చదువు అటకెక్కింది. మండలంలోని కేజీబీవీ పాఠశాల సిబ్బంది, మండల విద్యాధికారి కార్యాలయ సిబ్బంది ఈ నెల 10 నుంచి జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేస్తున్నారు. కేజీబీవీలోని 14 మంది ఉపాధ్యాయులు, 8 మంది బోధనేతర సిబ్బంది సమ్మెలో ఉన్నారు. పాఠశాలలో 228 మంది విద్యార్థులు ఉన్నారు. కేజీబీవీల్లో విద్యార్థుల రక్షణ కోసం ఇద్దరు, నాన్ టీచింగ్ సిబ్బంది ముగ్గురు కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న నిరసనలో పాల్గొంటున్నారు. మరో మూడు నెలల్లో పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉండటంతో ఈ సమయంలో సిబ్బంది సమ్మెతో బోధన అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి తాళం తీసే వారు కరువయ్యారు. తమ డిమాండ్లు సాధించుకోవడానికి ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఐఆర్‌పీ, మెసెంజర్‌లు జిల్లా కేంద్రంలోని సమ్మెలో పాల్గొంటున్నారు. ఆయా పనులు నిర్వహించాల్సిన సిబ్బంది సమ్మె చేస్తుండటంతో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలిచి పోయింది.

డిమాండ్లు నెరవేర్చాలి



సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవాలి. 20 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం బాధాకరం. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలి.

- తౌటి నరేశ్, ఎంఐఎస్

మహాగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల కొంరయ్య డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు ఆశయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జనవరి 19న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లుగా పోరాడుతుందన్నారు. మహాగర్జనను 58 ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి రాజయ్య, నల్లబుగ్గ పోచయ్య, కడారి ధనుంజయ్, కాంపల్లి బాపు, కొయ్యల సమ్మయ్య, అల్లూరి రవీందర్, మంత్రి నరేశ్, మారుపాక నిరంజన్, అక్కపాక లచ్చయ్య, మంద దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- ఎంపీడీఓ వెంకటేశ్వరరావు



సర్వేను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

రేగొండ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోరి తిరుమలగిరి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు పూర్తి వివరాలతో కూడిన సమాచారం అందించాలని కోరారు. అధికారులు అడిగిన సమాచారాన్ని క్లుప్తంగా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, టెక్నికల్ అసిస్టెంట్ రాజు, కారోబార్ తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: ప్రజాప్రతినిధులు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మంజూరునగర్‌లోని వేంకటేశ్వర స్వామిని ఆయన దర్శించుకొని మాట్లాడారు. తిరుమలలో నిర్వహించే అన్ని కైకర్యాలు మన భూపాలపల్లి శ్రీవారికి నిర్వహిస్తున్నామన్నారు. 2025 జనవరి 10వైకుంఠ ఏకదశి సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఉంటుందన్నారు. అలాగే 12న గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై దేవుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తయిన తరువాత దేవాదాయ శాఖ లేదా టీటీడీ వారికి అప్పగిస్తామని ఇంతకు ముందే తెలిపినట్లు పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి

భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న అమ్జద్‌పాషా

ములుగు రూరల్: సమస్యల పరిష్కారానికి కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్‌పాషా అన్నారు. శుక్రవారం మండలంలోని రాయినిగూడెం, లాలాయిగూడెం, కాశిందేవిపేట, పత్తిపల్లి, పొట్లాపూర్, అబ్బాపూర్, మల్లంపల్లి, ఇంచర్ల గ్రామాలలో సీపీఐ శత జయంతి వేడుకల్లో భాగంగా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాటాలకు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సాంబయ్య, తిరుపతి, సదయ్య, రాజయ్య, స్వామి, మహేందర్, లక్ష్మయ్య, సమ్మక్క, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు శిక్షణ అందించాలి

శాయంపేట : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్న ఆర్ ఎంపీలకు శిక్షణ అందించాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కర్రు సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులు శక్తికి మించి వైద్యం అందించొద్దని సూచించారు. కొందరు డాక్టర్ల పేర్లు పెట్టుకుని క్లినిక్ బోర్డులను ఏర్పాటు చేసి వైద్యం చేయడం సరికాదన్నారు. అలాంటి బోర్డులను తొలగించి ప్రథమ చికిత్స పేరుతోనే బోర్డులు ఏర్పాటు చేసుకుని వైద్యం అందించాలని అన్నారు. ఆర్ఎంపీల క్లినిక్‌లపై ఐఎంఏ, నేషనల్ కౌన్సిల్ సభ్యుల పేరుతో దాడులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మియాపురం శివుడు, పైడిపాల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆగస్టిన్, కోశాధికారి కడివెండి రమేశ్, వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కానుగుల నాగరాజు, కార్యదర్శి అబ్బు జయపాల్‌రెడ్డి ఉన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీశ్



టేకుమట్ల: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

టేకుమట్ల: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్య హక్కు చట్టం తీసుకువచ్చారని అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపిన నేత అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంగి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి నాంపెల్లి వీరేశం, మండల కోశాధికారి శాస్త్రాల కిరణ్, ఎలవేని రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: మండల కేంద్రంలో కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు కోయిల క్రాంతి ఆధ్వర్యంలో నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మండల అధ్యక్షుడు నర్సయ్య, యూత్ నాయకులు బానోతు రవీందర్, దుగ్యాల స్వామి, ముదురుకోళ్ల తరుణ్, సామాల సురేందర్, పున్నం ప్రవీణ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేవని పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, మన్యం సునీల్, ధనపనేని నాగరాజు, జల్లిగంపల కాదర్, చిట్టెం సాయి, శ్రీరాముల రమేశ్ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై మండల కేంద్రంలోని ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, జంగిలి రవి, మాడుగుల రమేష్, గాలి సమ్మయ్య, కొడారి చేరాలు, నల్లా కోటి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం)లో..



వెంకటాపురం(కె)లో..



రేగొండలో..

కొనసాగుతున్న సమ్మె



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

ములుగు: న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయం పక్కన సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె కార్యక్రమం శుక్రవారంతో 18వ రోజుకు చేరుకుంది. ఈమేరకు ఉద్యోగులు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, కోశాధికారి పాడ్య, సభ్యులు చిరంజీవి, దేవేందర్, ప్రవీణ్, ప్రతిభ, నాగలక్ష్మి, హరిత, అశ్విని, కవిత, రాధిక, జ్యోతి, భారతి, అనిత పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ మద్దతు

సమగ్రశిక్ష ఉద్యోగులకు పీఆర్‌టీయూటీఎస్ మద్దతు తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, శ్రీహరి, ముకుందరెడ్డి, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

వాజేడు: మండలంలో అదనంగా మరో విద్యుత్ లైన్ కోసం శుక్రవారం విద్యుత్, అటవీశాఖల సిబ్బంది సంయుక్తగా సర్వే నిర్వహించారు. వెంకటాపురం(కె) నుంచి ప్రస్తుతం ఉన్న విద్యుత్ లైన్‌లో సంకేతిక సమస్యలు తలెత్తితే వాజేడు మండలానికి విద్యుత్ సరఫరా ఉండడం లేదు. సమస్యను పరిష్కరించిన తర్వతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. అలా కాకుండా ఒక లైన్‌లో సమస్య వస్తే మరో లైన్ ద్వారా సరఫరాను ఇవ్వడానికి అదనపు లైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు వెంకటాపురం(కె) నుంచి వాజేడు, ధర్మవరం సబ్ స్టేషన్లకు 33 కేవీ లైన్ నిర్మించనున్నారు. అందులో భాగంగా లైన్ నిర్మించే సమయంలో అటవీశాఖ నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండటం కోసం ముందస్తుగా రిజర్వ్ ఫారెస్ట్ ఎక్కడెక్కడ ఉన్నది గుర్తించారు. రిజర్వ్ ఫారెస్ట్ వలన ఇబ్బంది లేకుండా చూసుకోవడంలో భాగంగా విద్యుత్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా ఈ సర్వేను చేశారు. ఈ సర్వేలో వెంకటాపురం(కె) ఏడీఈ అకిటి స్వామి రెడ్డి, ఏఈ హర్షద్ అహ్మద్, ములుగు కాంట్రాక్ట్ ఏఈ హరీష్, అటవీశాఖ నుంచి లలిత, ఆదిలక్ష్మి, హతీరామ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందజేస్తున్న కార్యదర్శులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లిలో పంచాయతీ కార్మికుడు గుర్రం సమ్మయ్య ఇటీవల ఎద్దు దాడిలో గాయపడి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ. 10వేలు, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం సహాయక నిధి నుంచి రూ. 20వేలు, ఎడ్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఎం భాస్కర్‌రెడ్డి రూ.5వేలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ కార్యాదర్శుల సంఘం నాయకుడు కర్ణా కంటి నరేష్, సభ్యులు, కారోబార్ కనుకుల శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం జీటీఎస్ఎస్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో వితంతువులకు చీరలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం, ప్రగళ్లపల్లి, బొల్లారం, నూగూరు కాలనీ, ఏడ్జెర్లపల్లి, బొమ్మనపల్లి, ఇప్పగూడెం గ్రామాలకు చెందిన 30 మంది వితంతువులకు అందజేశారు. మొరుమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్, సంస్థ సూపర్ వైజర్ దామోదర్, పాస్టర్ శ్యామ్, స్టీపెన్ ఉన్నారు.

రోడ్డు దాటాలంటే భయం

- జాతీయ రహదారిపై ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి నుంచి వెళ్లే ఎక్కెల రోడ్డు



అధ్వానంగా ఉన్న ఎక్కెల రోడ్డు

ఏటూరునాగారం: జాతీయ రహదారి నుంచి ఆ గ్రామానికి వెళ్లాలి అంటే సాహసం చేయాల్సిందే. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి 163 జాతీయ రహదారి నిర్మించారు గానీ కనీసం పలు గ్రామాలకు వెళ్లే సర్వీస్‌రోడ్డును మార్గాన్ని నిర్మించలేదు. కేవలం మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దానివల్ల గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్కెల, బూటారం, గంటలకుంట, చింతలపాడు, మామిడిగూడెం గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుకు 163 జాతీయ రహదారి లింక్ రోడ్డును ఏర్పాటు చేయలేదు. గతంలో ఉన్న కల్వర్టు స్థానంలో కాకుండా వేరే చోట కల్వర్టును నిర్మించడంతో 163 జాతీయ రహదారి దాటితేగానీ ఆ గ్రామానికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీనివల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు లేని కారణంగా రైతులు, విద్యార్థులు, కూలీలకు వెళ్లే మహిళలు సైతం చుట్టూ మూడు కిలోమీటర్లు ప్రయాణం చేసి మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుంది. జాతీయ రహదారికి ఎక్కెల, బూటారం గ్రామాలకు సర్వీస్‌రోడ్డును ఏర్పాటు చేసి గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

మరికొద్ది రోజుల్లో గ్రామ పంచాయతీ

నూతనంగా గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా బూటారం గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయనున్నారు. కానీ సరైన రోడ్డు మార్గం లేక నానా అవస్థలు పడుతున్నారు. స్థానిక మంత్రి, ఇంజనీరింగ్ అధికారులు చొరవ తీసుకొని సర్వీస్‌రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



163 జాతీయ రహదారి నుంచి దాటి రావాలి అంటే ఇబ్బందిగా మారింది. ఏ సమయంలో ఏ లారీ వచ్చి ఢీకొడుతుందో అర్థం కాదు. ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. రహదారి నుంచి సర్వీస్ రోడ్డు నిర్మించాల్సి ఉండగా నిర్మించకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వదలేశారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలి.

- బాషిక ఐలయ్య, ఎక్కెల

ఇబ్బంది పడుతున్నారు..



గ్రామంలోని మహిళలు కూలికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కెల, బూటారానికి వాహనాలు రావాలి అంటే జాతీయ రహదారి దాటి రావాల్సి వస్తోంది. అలా వచ్చే క్రమంలో ప్రమాదాలు జరగుతున్నాయి. దీనిని ఎవరు పట్టించుకోవడం లేదు.

- బాషిక ఓదెమ్మ, బూటారం